# 5

# దండువా

పొద్దునే వచ్చేసింది మా అర్చన. మామూలుగా పనులన్నీ చేసేసింది. పదకొండింటికి టీ పెట్టి తెచ్చి నాకెదురుగా కూర్చుంది. అది మా ఇద్దరికీ టీ బ్రేక్. టీ తాగుతూ బోలెడన్ని కబుర్లు చెప్పుకుంటాం.

"రాత్రికి ఏం వండనమ్మా?" అని అడిగింది.

పొద్దునే రాత్రి వంట గురించి అడిగిందంటే సాయంత్రం ఎక్కడికో పెత్తనానికి పోతుందని అర్థం.

రాత్రి వంట ఇప్పటి నించే వండటం ఎందుకే నేను వండుకుంటాను. అన్నా వినలేదు. కూరా పచ్చడి చేసి వెళ్తాను. నువ్వు అన్నం ఒక్కటీ వండేసుకో వేడి వేడిగా" అంది.

నన్ను ఇవతలి పుల్ల తీసి అవతల పెట్టనివ్వదు. మా ఇంట్లో సర్వెంట్ క్వార్టర్లో ఉంటుంది. తనూ, భర్తా, తమ్ముడూ, కొడుకూ ఉంటారు. వాళ్ల పన్లు వాళ్లు చేసుకుంటూ మా ఇంటికి అవసరమైన పని చేస్తారు.

వాళ్ళు సంతాలీలు. మనవైపు కోయ, చెంచులాగా బెంగాల్‌లో అదీ ఒక తెగ. రైలింజన్లు తయారు చేసే కర్మాగారం కట్టకముందు అదంతా అడవి ప్రాంతం. అందులో ఉండేవాళ్ళట, ఈ సంతాలీలు. కర్మాగారం నిర్మాణం సమయంలో ఎంతోమంది కూలీలుగా పనిచేశారు. ఆ తర్వాత అందులోనే పనివాళ్ళుగా ఉద్యోగాల్లో చేరిపోయారు. మరికొంతమంది భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటున్నారు.

చిన్న చిన్న ఆవాసాలను ఏర్పాటు చేసుకుని ఉంటారు. ఆమ్ బగాన్, కూల్‌గాఛీ, బాషా... ఇలా ఉంటాయి ఆ ఊళ్ళ పేర్లు. ఆడవాళ్ళు ఇళ్ళల్లో పన్లు చేసుకుంటారు. వాళ్ళ పేర్లు చాలా బావుంటాయి. అర్చన, గాయత్రి మైథిలీ, అనీల, ఊర్మిళ, విమలి, శకుంతళ.

మా ఇంటికి చుట్టాల తాకిడి ఎక్కువే. మా ఊళ్ళో రాత్రిపూట రైలెక్కితే తెల్లవారేసరికి కాశీ చేరిపోవచ్చు. కలకత్తా చూసుకుని మా ఇంటికొచ్చి ఇక్కడినుంచి కాశీ, ప్రయాగ, గయా వెళ్తారు.

మీ ఊరు ఎంత బావుంది. చక్కగా పూలచెట్లూ, పళ్ళచెట్ల మధ్యన ముని ఆశ్రమాలలాగా ఇళ్ళు. కొబ్బరి పాలలాంటి నీళ్ళు అని మెచ్చుకునే వాళ్ళు.

అవన్నీ ఒక ఎత్తు అయితే ఇక్కడి పనివాళ్ళు వాళ్ళందరికీ ప్రత్యేకమైన ఆకర్షణ. ఎంత చక్కగా పనిచేస్తారు. ఎంత చక్కటి పేర్లు. మనవైపు ఇంటికి చుట్టం వస్తే చాలు ఏదో వంకన పని ఎగ్గొడతారు పనివాళ్ళు. వీళ్ళు అలాకాదు చక్కగా సమయానికి అండగా ఉంటారు అని మురిసిపోయేవాళ్ళు.

వాళ్ల మాటల్లో అతిశయోక్తి ఏమాత్రం లేదు. ఇక మా అర్చన సరే ఇంట్లోనే ఉంటుంది. నాకు కొండంత అండ. వంటింటి తలుపు చప్పుడైతే చాలు "అమ్మా ఏం కావాలి? ఏదైనా పనుందా?" అంటూ పరుగున వచ్చేస్తుంది.

ఎవరినైనా భోజనాలకు పిలిచినా కనిపెట్టే ఉంటుంది. ఆ అయ్యగారూ వాళ్లా... వాళ్లది పిట్టతిండి. ఇంతెందుకు వండుకోడం? ఇందులో సగం చాలు అని గుర్తు చేస్తుంది.

"అమ్మో వాళ్లా? పిల్లలు కాదు పిశాచాలు. ఇదేం చాల్తుంది? మరో రెండు రకాలు చేద్దాం" అని హెచ్చరిస్తుంది. దాని బాధలు నాతో చెప్పుకుంటుంది. నా బాధలు పాల్పంచుకుంటుంది. అయిన వారందరికీ దూరంగా ఉన్న నాకు పనిమనిషి మాత్రమే కాదు పెద్ద అండ. ఇద్దరం యజమానురాలూ పనిమనిషీ లాగా కాకుండా స్నేహితుల్లా ఉంటాం.

రాత్రికి వంట నేను చేసుకుంటాలే అన్నా వినకుండా తనే చేసి పెట్టేసింది. "ఎక్కడికెళ్తున్నావ్? పెళ్ళికా" అంటే,

"కాదు. దండువా ఉంది!" అంది.

నేనూ రెట్టించలేదు. వెళ్లిపోయింది. మళ్లీ సాయంత్రం నాలుగింటికి చక్కగా చిలుకలా తయారై వచ్చింది. వెంట ఒకావిడ. అర్చన మేనత్తట. పేరు సుమిత్ర. అమ్మా మన బేలన్ (అప్పడాలకర్ర) కావాలి తీసుకెళ్తున్నా అంది అర్చన. అలాగే తీసికెళ్లు అన్నా. ఆ వెళ్లేచోట పూరీలు వత్తుతారు కాబోలు అనుకున్నా.

రాత్రి ఏవేళ్టికి వచ్చిందో మరి. తెల్లవారగానే మామూలుగా పన్లోకి వచ్చింది. పన్లన్నీ చేసేసింది. టీ బ్రేక్‌లో మళ్లీ అడిగాను. నిన్న ఎక్కడికి వెళ్లావు అనీ.

"మా వాళ్లింట్లో దండువా ఉంటే వెళ్లాం" అంది.

"దండువా అంటే ఏమిటి? అదేమైనా వేడుకా?" అని అడిగాను.

చెప్పుకొచ్చింది. "ఆ మధ్య బాఘాలో మా బాబాయి కూతురి పెళ్ళైతే వెళ్లాను. గుర్తుందా అమ్మా" అంది.

"అవును గుర్తుంది" అన్నా.

"ఆ అమ్మాయి పేరు పూర్ణి. దాన్ని అత్తవారింట్లో కాల్చుకు తింటున్నారుట. పడలేక పుట్టింటికి వచ్చేసింది. సంసారం అన్నాక సవాలక్ష గొడవలుంటాయి. కాస్త ఓర్పుగా ఉంటే అవే సర్దుకుంటాయి అని నచ్చచెప్పి దిగబెట్టి వచ్చారుట మా పిన్నీ, బాబాయి. అక్కడ వాళ్లల్లో ఏమీ మార్పు రాలేదు. తిట్టడం నుంచీ కొట్టడంలోకి వెళ్లింది వ్యవహారం. పూర్ణి మళ్లీ వచ్చేసింది పుట్టింటికి.

"పెళ్లై ఆర్నెల్లు కాలేదు. మొగుడిని వదిలిరావే అంటే రాను పొమ్మనాల్సిన పిల్ల మాటి మాటికీ ఎందుకలా వచ్చేస్తోంది అని అనుమానం వచ్చి ఆరా తీశారుట తప్పంతా వాడిదేనట. పాపం పూర్ణి ఓర్చుకుంటోందిట. విషయం తెలుసుకుని మా వాళ్లు వెళ్లి వాడిని కూర్చోబెట్టి నాలుగు చివాట్లు వేసి వచ్చారుట. నాల్రోజులు బాగానే ఉన్నారు. మళ్ళీ మొదలు కొట్టడం, నానా మాటలూ అనడం. అప్పుడు మా ఊర్నించీ నలుగురు పెద్దవాళ్లని వెంటబెట్టుకెళ్లారుట. వాళ్లవైపు నుంచీ నలుగురు పెద్దవాళ్లొచ్చారుట. ఇదీ సంగతి అంటే అందరూ పూర్ణి అత్తవారిని బాగానే తిట్టారుట. జాగర్త. ఈసారి తేడా వస్తే దండువా పెడతాం అన్నారుట. మా పిల్లవాడికి బుద్ధి చెప్తాం అన్నారుట అటువైపు వాళ్లు. కానీ నెల్రోజులు గడిచినా పరిస్థితి దిగజారుతుందే

తప్పు చక్కపడడం లేదు. అందుకే మా పిన్నీవాళ్లు దండువా పెట్టారు నిన్న. మేమంతా వెళ్లాం" అంది అర్చన.

"దండువా అంటే ఏమిటి? అది చెప్పు" అన్నాను. అసలు విషయం వదిలేసి ఏదో సోది చెప్తుంటే విసుగేస్తోంది నాకు.

"అప్పుడు పెళ్లిలో పెళ్లికొడుకు పెళ్లికూతురూ మధ్యన కూర్చుంటే అటు వైపు పెద్దవాళ్లూ ఇటువైపు పెద్దవాళ్లు వాళ్ల చుట్టూ తిరుగుతూ పూలు జల్లి ఆశీర్వదిస్తాం కదా!

అప్పుడు తిరిగిన పెద్దవాళ్లం అందరం ఇప్పుడు వెళ్లి ఆ పిల్లాడిని మధ్య కూర్చోబెట్టి చీపురూ, చేటా, అప్పడాల కర్ర వంటివి తీసుకొని తలొకటీ అంటిస్తాం. దండువా అంటే అదే!" అంది అర్చన.

నాకు గొంతెండిపోయింది.

"అదేవిటి అలా చేస్తే వాళ్లు దెబ్బలాడరా?" నా భయం బయట పెట్టుకున్నా.

"తప్పు వాళ్లల్లో పెట్టుకుని ఎందుకు దెబ్బలాడతారు? నయానా, భయానా చెప్పేం. వినకపోతే ఏం చేస్తాం? మరి అప్పుడు పెళ్లికెళ్లి పూలుజల్లి ఆశీర్వదించి వచ్చినవాళ్లం పిల్లకి అన్యాయం జరుగుతూ ఉంటే చూస్తూ ఊరుకుంటామా? అందుకే ముందే వాళ్లకి చెప్తాం దండువా చేస్తాం అని. చెప్పే వెళ్తాం. మాతోబాటు వచ్చినా పూర్ణి వాళ్లమ్మా, పూర్ణి వదినా మాత్రం దండువా చెయ్యరు. ఎంతైనా అల్లుడు కదా మరి!" అంది.

నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు నాకు. తలోటీ తగిలించడంలో కూడా ఎన్ని పద్ధతులూ అని ఆశ్చర్యం వేసింది.

"మరి పిల్లాడి తల్లి ఏం చేస్తుంది?" తెలుసుకుందామని అడిగా!

"పక్కన నుంచుని ఏడుస్తుంది. వదిలెయ్యండి. ఇక మీదట బుద్ధిగా ఉంటాడు అని బతిమాలుతుంది. అలా కాకుండా దెబ్బలాటకి దిగినా అడ్డం వచ్చినా ఆవిడకీ ఓటి తగిలిస్తారు. దండువా అయ్యాక వెళ్లినవాళ్లందరికీ ఫలహారాలు పెట్టి ఛాయ్ ఇస్తారు" అంది.

"ఏంటి కొట్టడానికి వెళ్తే ఫలహారాలూ మర్యాదలూ కూడానా?" నమ్మబుద్ధి కాలేదు.

"అవును నిన్న వాళ్లు తియ్యబూంది, కారంబూందీ పెట్టారు. మర్యాదలు చెయ్యాలి మరి. మేమేం గతిలేక పోయామా వాళ్లింటికి. మా పిల్లని హింస పెడుతున్నారు కాబట్టి వెళ్లాం, మా పిల్లని బాగా చూసుకుంటే వాళ్ల గడప ఎక్కే పనేముంది?" అంది.

"మరి మీరెళ్లి ఇంత గొడవ చేశారు కదా! ఈ కక్ష కడుపులో పెట్టుకుని మీ పూర్ణిని ఏమైనా చేస్తే?" నా కంఠం అయోమయంగా ఉంది.

"అలా చేస్తే చంపెయ్యమా? దండువా చేసొచ్చాక ఓ కన్ను వాళ్ల మీద వేసే ఉంచుతాం. ఇకనైనా బుద్ధిగా ఉన్నారా సరే. మళ్లీ పిల్లను కొట్టడం తిట్టడం చేస్తే ఛాటా చేసేస్తాం!" అంది.

దండువానే పూర్తిగా అర్థం కాలేదు నాకు. అంతలోనే ఈ ఛాటా ఏమిటి? అదే అడిగాను.

"ఛాటా అంటే తెగతెంపులు. మా ఊరి పెద్దవాళ్లని వాళ్ల ఊరి పెద్దలనీ కూర్చోబెట్టి ఛాటా చేస్తారు. పెళ్లిలో వాళ్లు పిల్లకి పెట్టిన వస్తువులూ అవీ తిరిగి ఇచ్చేస్తారు. అలాగే వీళ్లూ వాళ్ల పిల్లవాడికి ఇచ్చిన కానుకలు తిరిగి ఇచ్చెయ్యాలి.

తప్పు వాళ్లదే కాబట్టి వెళ్లిన వాళ్లకి భోజనాలు పెట్టాలి. తప్పు వాళ్లదే అని నలుగురి ముందూ వాళ్లచేతే ఒప్పించి పిల్లని మనింటికి తెచ్చేసుకుంటాం. ఇక ఆ తర్వాత దానిష్టం. పోతే మారు మనువుకి పోతుంది. లేదూ కాయ కష్టం చేసుకుంటూ ఉండిపోతుంది" అన్ని చెప్పింది అర్చన.

నాకు బోలెడు పనుంది అంటూ వెళ్లిపోయింది.

నా బుర్ర వేడెక్కిపోతోంది. అదివరకు లేవుగానీ ఈ మధ్యన మావాళ్ల ఇళ్లల్లో విడాకులు సర్వసాధారణం అయిపోయాయి. ఏవో కారణాలు. చిన్నవి కొన్ని, పెద్దవి కొన్ని. కారణం ఏదైనా పర్యవసానం విడిపోవడమే.

ఈ మధ్యనే ఓ వ్యవహారం విడాకుల దిశగా పయనిస్తోంది. పెళ్లై ఆర్నెల్లు కాలేదు. అప్పుడే ఏవో గొడవలు. ఫలాని వారి గురించి విన్నారా? బ్రహ్మాండం

దద్దరిల్లేలా పెళ్లి చేశారు. మరి పిల్ల ఇంకా మొగుడి దగ్గరికి వెళ్లలేదు. ఏవిటో ఖర్మ అని అందరూ చర్చించుకుంటున్నారు. మరది సానుభూతో ఎగతాళో మాకే అర్థం కావడం లేదు.

ఇరుపక్షాల వాళ్లూ మాకు కావల్సిన వాళ్లే. ఫోన్లో మాట్లాడినప్పుడు ఆ విషయం చెప్తున్నారు. వాళ్లు చెప్పేదీ కరెక్టే అనిపిస్తోంది. మరి రెండో వాళ్ళతో మాట్లాడినప్పుడు వాళ్ల వాదనలోనూ నిజం ఉందనిపిస్తోంది.

అంతా ముసుగులో గుద్దులాట. అయోమయం.

ఇవ్వాళ అర్చన చెప్పింది విన్న తరువాత నాకు జ్ఞానోదయం అయింది. వాళ్ల లెవెల్లో లాగా దండువా చెయ్యకపోయినా వాళ్లనీ వీళ్లనీ, పిల్లనీ పిల్లాడినీ ఒక దగ్గర చేర్చి, నలుగురు పెద్దవాళ్లు పూనుకుంటే అసలు నిజం బయటికి వస్తుంది. చిన్న చిన్న విషయాలకే రాద్ధాంతం చేస్తుంటే మందలించి వాళ్ల కాపురం చక్కదిద్దచ్చు. లేదూ నిజంగానే పరిస్థితి చెయ్యి దాటిపోయి విడిపోవాలనుకుంటే ఎందుకు విడిపోయారో ఆ కారణం అందరికీ తెలుస్తుంది.

మా అబ్బాయి బంగారం. అమ్మాయిదే తప్పంతా.

మా అమ్మాయి అమాయకురాలు. వాడే వెధవ. అంటూ ప్రచారం చేసే అవకాశం ఉండదు.

వెంటనే నా ఆలోచన అమలుచేయాలనుకున్నాను. ఫోన్ చేసి మా బాబాయితో మాట్లాడాను. నలుగురు పెద్దవాళ్లు కలిసి వాళ్లందరినీ ఓ చోట చేర్చి అసలు విషయం ఏమిటో కనుక్కోమన్నాను.

ముందు వినగానే "మనకెందుకొచ్చిన తలనెప్పులే ఇవన్నీ? వాళ్ల గొడవ వాళ్లు పడతారు" అన్నాడు మా బాబాయ్.

అలా కాదులే బాబాయ్ అని మా అర్చన చెప్పినదంతా చెప్పాను. "మరి పెళ్లికెళ్లి విందారగించి వచ్చాం కదా! ఇప్పుడు కల్పించుకుంటే తప్పేమీ లేదు. ఇది కూడా ఒక బాధ్యత అనుకుంటే బావుంటుంది" అని నచ్చచెప్పాను.

బాబాయ్ ఒప్పుకున్నాడు. "సరేలే మాట సాయమే కదా! ప్రయత్నించి చూద్దాం" అన్నాడు.

ఆ మాత్రం మాట చాలు నాకు. బాబాయ్ అనుభవజ్ఞుడు. కార్యశూరుడు. ఆయన తల్చుకుంటే వ్యవహారం చక్కదిద్దగలడు.

అర్చనా వాళ్లలాగా కాకుండా, మాకు తగ్గట్టు మేము ప్రయత్నం చేయొచ్చు.

మరీ గాలికొదిలేసి ఊరుకోకుండా పిల్లల జీవితాలు సరిదిద్దుకోవచ్చు. కనీసం కొన్ని వివాహ బంధాలనైనా తెగిపోకుండా కాపాడవచ్చు. ❑

*ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 27 జనవరి 2011*